క్లుప్తంగా

జీవనోపాధి కల్పించాలి



బచ్చన్నపేట: ప్రతి వ్యక్తి పదిమందికి జీవనోపాధి కల్పించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని నారాయణపురం గ్రామంలో సికింద్రాబాద్ మహంకాళి అమ్మ వారి దేవాలయ శాశ్వత చైర్మన్ నరేష్ ఏర్పాటు చేసిన జీవ పౌల్ట్రీ ఫామ్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ప్రభుత్వం పలు పరిశ్రమలకు సబ్సిడీ ఇస్తూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు జీవనోపాధి కల్పించడానికి పలు రకాల ప్రోత్సాహకాలను అందిస్తున్నామని తెలిపారు. నరేష్ కుమారులు ధీరజ్, దినేష్, చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

దేవరుప్పుల : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక అర్హతపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్టు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద అధికార యంత్రాంగం, ఇందిరమ్మ కమిటీ సంయుక్తంగా ఎంపిక చేసి నిర్దేశించిన 22 మంది లబ్ధిదారుల తుది జాబితాను గ్రామ కార్యదర్శి మధుకర్ అతికించారు. ఈ జాబితాలోని లబ్ధిదారుల ఎంపికపై ఎలాంటి సందేహాలున్నా నేడు(సోమవారం) సాయంత్రం 5 గంటల లోపు మండల పరిషత్ కార్యాలయంలో తగు ఆధారాలతో సంప్రదించాలని తెలిపారు.

మల్లన్న కల్యాణోత్సవంలో పాల్గొన్న బాలలక్ష్మి

జనగామ రూరల్: మండలంలోని పెంబర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యూత్ వైస్ ప్రెసిడెంట్ బస్వరాజ్ మల్లేష్ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవానికి ఆదివారం బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి హాజరై స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు లోకుంట్ల ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉడత రవి యాదవ్, కాంగ్రెస్ పార్టీ పెంబర్తి గ్రామశాఖ అధ్యక్షుడు బంద్రు సిద్దులు పాల్గొన్నారు.

పెన్షనర్ల మనోవేదన పట్టించుకోండి

చిల్పూరు: రిటైర్డ్ పెన్షనర్ల మనోవేదనను పట్టించుకోకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై ఇప్పటికే నలుగురు మృతి చెందారని ప్రభుత్వం ఇకనైనా స్పందించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా 2024 రిటైర్డ్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఇనుగాల ఇంద్రసేనారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. లక్షల రూపాయలు వెచ్చిస్తూ హైదరాబాదులో అందాల పోటీలను నిర్వహించడం సమంజసం కాదని పేర్కొన్నారు. 14 నెలలు ఓపిక పట్టాం సహనం కోల్పోకముందే దాచుకున్న సొమ్ము అందజేయాలని కోరారు.

పార్టీ ఇన్సూరెన్స్ అందజేత

చిల్పూరు: రాజవరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఎడ్ల యాకమ్మ ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందింది. కాగా యాకమ్మ పార్టీ సభ్యత్వ ఇన్సూరెన్స్ ఉండడంతో పార్టీ నుంచి ఆదివారం రూ.రెండు లక్షల చెక్కు రాగా మాజీ ఎమ్మెల్యే రాజయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో యాకూబ్, ఎడ్ల మహిపాల్, రంగు రవి, వెంకటస్వామి, ఎడ్ల శ్రీను, మోటం రాజు, బైరగోని మల్లయ్య, శాయి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

బచ్చన్నపేట: వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను ధరించాలని ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని, ముగ్గురు కూర్చొని ప్రయాణం చేయొద్దన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులను నమోదు చేస్తామని, అందరూ డ్రైవింగ్ లైసెన్స్‌లను కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

దేవరుప్పుల : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ విమర్శించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రైవేట్ విద్యాసంస్థలు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేస్తేనే పరీక్షలు నిర్వహిస్తామని మొండి పట్టుదలతో ఉన్నాయన్నారు. ఫీజులు చెల్లించిన విద్యాసంస్థలకే పరీక్షలు నిర్వహిస్తామనే యూనివర్సిటీల మొండి వైఖరి తగదన్నారు. రాష్ట్ర ప్రజలకు ఏ మాత్రం ఉపయోగంలేని అందాల పోటీలకు రూ.200 వందల కోట్లు ఖర్చు చేయడం ప్రజాధనం దుర్వినియోగం అవుతుందన్నారు.

వారానికో ప్రమాదం

- పది మోటల బావి వద్ద ప్రమాదకరంగా మలుపు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- ఏపుగా పెరిగిన చెట్లపొదలు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని వైనం
- నివారణ చర్యలు చేపట్టాలని ప్రయాణికుల వేడుకోలు



ఆలేరు దారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

బచ్చన్నపేట: మండల కేంద్రం నుంచి ఆలేరు పట్టణానికి వెళ్లే రహదారిలో గోపాల్‌నగర్ గ్రామం దాటిన తర్వాత పది మోటల బావి వద్ద ఉన్న మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. ఈ మూల మలుపు వద్ద వారానికో ప్రమాదం జరుగుతుండడంతో ప్రజలు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ప్రమాదాల్లో ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. డెకరేషన్ లక్ష్మణ్, ఈదులకంటి రాజిరెడ్డి, పోచన్నపేట గ్రామానికి చెందిన ఓ మహిళ ఈ మూలమలుపు వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. రెండు వాహనాలు ఈమూల మలుపులో ఢీకొని శ్రీనివాస్ అనే వ్యక్తి కాలు విరిగి ఇప్పటికీ కోలుకోలేదు. చిమ్ముల విజయ్ ప్రమాదానికి గురై గాయపడ్డాడు. పోచన్నపేటకు చెందిన పేరిణి గౌతమ్ కారు అదుపు తప్పి మృతి చెందాడు. రాత్రిపూట వాహనాలు ఢీకొని లేదా అదుపుతప్పి పడిపోవడంతో అనేకమంది గాయపడ్డారు. బచ్చన్నపేట నుంచి ఆలేరుకు డబుల్ రోడ్డు వేయడంతో వాహనాలు చాలా స్పీడ్‌గా వెళ్లి దగ్గరకు వచ్చే వరకు కూడా మూలమలుపు కన్పించకపోవడంతో సడన్ బ్రేకులు వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా దగ్గరగా చెట్లు గుబురుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. అలాగే ఈ ప్రమాదకరమైన మూలములపు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి వాహనదారుల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

చెట్లను తొలగించాలి



పదిమోట బావి మూల మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా గుబురుగా ఉన్న చెట్లను తొలగించాలి. అప్పుడే ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పిస్తాయి. చెట్లను తొలగించాలని పలు మార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– అల్వాల నర్సింగారావు, బచ్చన్నపేట

హెచ్చరిక బోర్డులు పెట్టాలి



ఆలేరు నుంచి బచ్చన్నపేటకు వచ్చే రోడ్డులో మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. డబుల్ రోడ్డు కావడంతో వాహనాలు అతివేగంతో వెళ్తూ మలుపులో అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారు.

– బూరుగు భాస్కర్, బచ్చన్నపేట

అధికారుల నిర్లక్ష్యమే నిదర్శనం



పది మోటల బావి వద్ద గల మూలమలుపులో ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణం అధికారుల నిర్లక్ష్యమే. డబుల్ రోడ్డు వేసే సమయంలో రోడ్డుకు దగ్గరగా ఉన్న చెట్లను తొలగించలేదు. ఇప్పటికైనా రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొలగించాలి.

– కర్రె యాదగిరి, ఇందిరానగర్

భారత ఆర్మీ క్షేమంగా ఉండాలని పూజలు



పూజల్లో పాల్గొన్న నాయకులు

చిల్పూరు: దేశ సరిహద్దులో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న భారత ఆర్మీ క్షేమంగా ఉండాలని కోరుతూ ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు గంటి ఉపేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు రవీందర్ శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేశం కోసం చేస్తున్న పోరాటంలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. పాకిస్థాన్‌కు భారత్‌ను ఎదుర్కొనే దమ్ములేక దొంగచాటున దాడులు చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆర్మీకి ఎలాంటి ప్రాణ నష్టం జరుగకుండా ఉండాలని ప్రత్యేక పూజలు చేమయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెలిశాల శ్రీనివాస్, ముక్కెర శ్రవణ్, అశోక్, రాజు, రమేష్, తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశం సుభిక్షంగా ఉండాలని నేడు పూజలు

స్టేషన్‌ఘన్‌పూర్: యుద్ధవాతావరణ పరిస్థితుల్లో భారత్ సుభిక్షంగా ఉండాలని, శాంతి నెలకొనాలని కోరుతూ స్టేషన్‌ఘన్‌పూర్ శివారులోని ప్రసిద్ధ భైరవ గుట్టలోని వైద్యనాథస్వామి దేవాలయ సన్నిధిలో వైశాఖపూర్ణిమ సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు, శివభక్తుడు భూనేటి కిషన్‌రెడ్డి తెలిపారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో బాలయేసు విద్యార్థుల ప్రతిభ



దయ్యాల స్నేహిత

దేవరుప్పుల : మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఎప్‌సెట్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం గంగాపురంలోని వ్యవసాయ కుటుంబానికి చెందిన దయ్యాల శోభ, శ్రీనివాస్ కూతురు స్నేహిత ఇంటర్ బైపీసీలో 989 మార్కులతోపాటు ఎప్‌సెట్‌లో రాష్ట్రస్థాయిలో 856వ ర్యాంకు సాధించింది. దేవరుప్పుల మండల సీతారాంపురానికి చెందిన పోరండ్ల సైదమ్మ, శ్రీనివాస్ కుమారుడు శివగణేష్ ఇంటర్ ఎంపీసీలో 991 మార్కులు.. ఎప్‌సెట్‌లో రాష్ట్రస్థాయిలో 2,124 ర్యాంకు సాధించినట్లు తెలిపారు.



శివగణేష్‌ను సన్మానిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

పేదరికాన్ని జయించిన శివగణేష్

మండలంలోని సీతారాంపురానికి చెందిన పోరండ్ల సైదమ్మ కుమారుడైన శివగణేష్ ఐదేళ్ల వయస్సులో అనారోగ్యంతో తనతండ్రి శ్రీనివాస్‌ను కోల్పోయారు. తల్లి సైదమ్మ కూలీ పనిచేసుకుంటూ శివగణేష్‌ను బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో పదో తరగతి, హైదరాబాద్‌లో ఇంటర్ చదివించింది. తల్లీ శ్రమకు తగ్గట్టుగా ఇంటర్‌లో 991 మార్కులు.. ఎప్‌సెట్‌లో 2,124 ర్యాంకు సాధించడంతో ఎస్‌హెచ్ఈటీ చైర్మన్ అంబటి యాకన్న ఆధ్వర్యంలో శివగణేష్‌కు రూ.3వేలు అందజేసి సన్మానించారు.

నరసింహస్వామి భక్తుల గిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు



యాదగిరిగుట్టపై..

జఫర్‌గఢ్: మండల కేంద్రమైన జఫర్‌గఢ్‌లో పడమర కొండపై వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి వేల్పుగొండ కొండ చుట్టూ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆదివారం గిరిప్రదక్షిణలు చేశారు. గత ఏడాది నుంచి ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజున భక్తులు మొదటగా కొండ దిగువన ఉన్న రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పాతూరు మీదుగా కొండచుట్టూ గిరి ప్రదక్షిణలు చేస్తున్నారు. మార్గ మధ్యలో వేల్పుల కాలంలో నిర్మించబడిన విష్ణు ఆలయం, శివాలయం, హనుమాన్ విగ్రహాలను దర్శించుకొని తిరిగి రామాలయం చేరుకుంటారు. ఈ ప్రదక్షిణలో గ్రామం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఇక్కడ గిరిప్రదక్షిణ చేయడం వల్ల కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. కాగా గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు పూర్వ విద్యార్థులైన కందగట్ల రమేష్, ఇమ్మడి లక్ష్మీనారాయణ ఆదివారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణకు తరలిన భక్తులు

జనగామ: స్వాతి నక్షత్రం, శ్రీలక్ష్మీనర్సింహస్వామి జయంతిని పురస్కరించుకుని యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి ఆదివారం జిల్లానుంచి వివిధ మండలాలకు చెందిన భక్తులు తరలివెళ్లారు. యాదగిరిగుట్ట చుట్టూ గిరిప్రదక్షిణ చేసి, మెట్ల మార్గం గుండా కొండపైకి చేరుకున్నారు. గిరి ప్రదక్షిణ భక్తుల కోసం ఆలయ అధికారులు బ్రేక్ దర్శనం అవకాశం కల్పించారు. కార్యక్రమంలో గురుస్వామి ధర్మపురి శ్రీనివాస్, చింతకింది మల్లేశ్, నాగేందర్, చంద్రయ్య, వేణు, శ్రీధర్, వేముల శంకర్, అనంతుల ఆంజనేయులు, రాజు, బండ వేణు, ఉపేందర్, పాండు, కొత్తపల్లి శ్రీనివాస్, వెంకటేశ్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఎల్లమ్మ ఉత్సవానికి ఆహ్వానం

కొడకండ్ల: మండలకేంద్రంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రేణుకా ఎల్లమ్మ దేవి ఉత్సవానికి రావాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఉత్సవ కమిటీ నాయకులు ఆదివారం ఆహ్వానించారు. సోమవారం నుంచి నిర్వహించే పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరినట్లు ఉత్సవ కమిటీ బాధ్యులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, పట్టణ అధ్యక్షుడు మసురం వెంకటనారాయణ, ఉత్సవ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఏబీవీ జూనియర్ కళాశాల ప్రభంజనం



మధువిత



దేవిశ్రీ

జనగామ : ఎప్‌సెట్ పరీక్ష ఫలితాల్లో ఏబీవీ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అత్యుత్తమ ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారు. ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల మార్కులకు తీసిపోకుండా ఎంసెట్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు సాధించి జనగామ ప్రాంతానికి వన్నె తెచ్చారని కళాశాల ప్రిన్సిపాల్ కనకరాజు తెలిపారు. ఎప్‌సెట్‌లో రాజబోయిన మధువిత రాష్ట్రస్థాయిలో 316వ ర్యాంకు, చెన్నోజు దేవిశ్రీ 1,886, మంగ మౌనిక 2,734, ఎంజెల్ గ్రేస్ 8,387, పాశికంటి వర్షిత్ 9,485, మహమ్మద్ అబ్దుల్ ఖదీర్ 9,726 ర్యాంక్ సాధించినట్టు పేర్కొన్నారు. ఇరవై వేల లోపు మరెన్నో ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



చిన్నపెండ్యాలలో నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



నర్మెటలో..

చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామంలోని అభ్యుదయ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో 1982–83 విద్యాసంవత్సరానికి చెందిన 7వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించుకున్నారు. కార్యక్రమాన్ని గజ్జెల దామోదర్, కీర్తి ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాడు విద్యాబుద్ధులు చెప్పిన హెచ్‌ఎం చాడ సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సంపత్‌కుమార్, తిరుపతిరెడ్డి, తాళ్లపల్లి భిక్షపతి, సంపత్‌కుమార్‌లను సన్మానించారు. రబ్బాని, భారతిరెడ్డి, మల్లారెడ్డి, స్వామి, శంకర్, రాజేందర్, రమేష్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, కొంరయ్య, రాజయ్య, ఇంద్రాణి ఉన్నారు.

నర్మెట ఉన్నత పాఠశాలలో..

నర్మెట: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఎస్సెస్సీ 2006–07 విద్యార్థులు స్థానికంగా ఉన్నో ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. పాఠశాల విద్య అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిరపడి రెండు దశాబ్దాలకు తిరిగి కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పలువురు వాఖ్యానించారు. ఈసందర్భంగా నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి ఆశీర్వాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, రవికిరణ్, కరుణాకర్‌రెడ్డి, సూర్య ప్రకాశ్, సురేష్, పవన్, రమ్యకృష్ణ, సుధారాణి, శ్రీలక్ష్మి, నవనీత, మమత, అన్వర్ సుల్తానా, వాసుదేవరెడ్డి, అజిత్‌పాషా, శ్రీరాములు, చంద్రసేనారెడ్డి, రవిశంకర్ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహుడి జయంతి వేడుకలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ పెద్ద గుట్టపై శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా నరసింహుడి జయంతి వేడుకలు నిర్వహించారు. వైష్ణవానాం శ్రీనరసింహుడి జయంతిని పురష్కరించుకొని ఆలయ అర్చకులు కేవీజీకే ఆచార్య వేదోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి సహస్రనామ అర్చన, విశేష నీరాజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. పాడి పంటలు, పిల్లా పాపలతో చల్లగా ఉండాలని మొక్కుకున్నారు.

హనుమాన్ మాలధారుల నగర సంకీర్తన



అన్నదానం చేస్తున్న భక్తులు

బచ్చన్నపేట: మండలంలోని బండనాగారం, కేసిరెడ్డిపల్లి, బచ్చన్నపేట గ్రామాలలో హనుమాన్ మాలధారులు నగర సంకీర్తన చేశారు. ఆదివారం స్వాములు హనుమాన్ దేవాలయం నుంచి బయల్దేరి దేవుని చిత్రపటంతో భజనలు చేసుకుంటూ గ్రామంలోని అన్ని వీధుల్లో తిరిగారు. ఈ సందర్భంగా పలువురు గురుస్వాములు మాట్లాడుతూ గ్రామంలో నగర సంకీర్తన చేస్తే అందరిలో భక్తిభావం పెరుగుతుందని అన్నారు. మహిళలు బిందెలతో నీళ్ల పోస్తూ కొబ్బరి కాయలను కొట్టి మంగళ హారతులతో నీరాజనం పలికారు. మాలధారులకు పలువురు భక్తులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్వాములు పలువురు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

రఘునాథపల్లి: మండలంలోని శ్రీమన్నారాయణపురంలో ఇటీవల తిప్పారపు ప్రణయ్, కోమల్లలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బంద కుమార్ సతీమణి కోమలత మృతిచెందగా.. ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ నాయకులతో కలిసి ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయా గ్రామాల్లో మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మీ నరేందర్, బొల్లం అజయ్, సుల్తాన్ నర్సింహారెడ్డి, కావటి భాస్కర్‌యాదవ్, లోనె శ్రవణ్‌కుమార్, గొల్లూరి భిక్షపతి, తుడి సుదర్శన్, రవీందర్, అంజయ్య, బాలరాజు, ప్రభాకర్, మాచర్ల శ్రీనివాస్, లీల, శేఖర్‌బాబు, శ్రీనివాస్, శ్రీకాంత్, పద్మ, యాదమ్మ, రాజు, శంకర్, యాదగిరి, వీరస్వామి, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

ముదిరాజ్ మెరిట్ విద్యార్థులకు సన్మానం



మెరిట్ విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల విడుదలైన పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ సాధించిన స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లికి చెందిన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులను ముదిరాజ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. శివునిపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన విద్యార్థులు రేగుల హాస్య(550), చెన్నూరి శ్వేత(549), గోరంట్ల హర్షవర్ధన్(514)లను శాలువాలతో సత్కరించి నగదు ప్రోత్సాహకాలను అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువత కార్యదర్శి గోరంట్ల యాదగిరి, యూత్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి శాగ సురేష్ మాట్లాడారు. విద్యార్థులు చదువులో ఉత్తమ ప్రతిభ చాటడం సంతోషకరమని అన్నారు. వెంకటేశ్వర్లు, అనీల్, రాకేష్, శివలింగం, రమేష్, అజయ్, శ్రీకాంత్, తిరుపతి, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 85 ఎకరాల్లో మామిడితోటల నష్టం

పాలకుర్తి టౌన్: మండలంలో 85 ఎకరాల్లో మామిడి తోటల నష్టం వాటిల్లినట్లు ఉద్యాన వనశాఖ అధికారి ధీరజ్ ఆదివారం తెలిపారు. ఈనెల 6న గాలివాన బీభత్సవానికి మండలంలోని విస్నూరు, వావిలాల గ్రామాల్లో మామిడి తోటల రైతులకు నష్టం వాటిల్లిందని తెలిపారు. మామిడి తోటల నష్ట వివరాలను ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు ఆయన పేర్కొన్నారు.

వాసవీమాత సన్నిధిలో కుంకుమపూజ



కుంకుమ పూజ చేస్తున్న మహిళలు



భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రసాద్

జఫర్‌గఢ్: స్థానిక ఆర్యవైశ్య సంఘంలో కులదైవమైన వాసవీమాత సన్నిధానంలో పౌరోహితులు అనిల్ నేతృత్వంలో ఆర్యవైశ్య మహిళలు ఆదివారం కుంకుమ పూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమానికి ముందుగా భారత్– పాకిస్తాన్ మధ్య యుద్ధవాతావరణం పోయి శాంతి నెలకొనాలని కోరుతూ అమ్మవారిని పూజించారు. అనంతరం మహిళలు తమ పసుపు కుంకుమలతో సౌభాగ్యంగా ఉండాలని దేశం పాడి పంటలతో పచ్చగా ఉండాలని పూజలు నిర్వహించినట్లు పూజారి అనిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు అంచూరి యుగంధర్, దాంశెట్టి సోమన్న, ఇమ్మడి అశోక్, బజ్జూరి మణికాంత్, రేవూరి రమేష్, బోనగిరి శ్రవణ్‌కుమార్, గందె మురళి, దొడ్డ రమేష్, గందె సోమన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య భవనం ప్రారంభం

పాలకుర్తి: పాలకుర్తి మండలం గూడూరు గ్రామంలో నిర్మించిన ఆర్యవైశ్య భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘం గ్రామ అధ్యక్షుడు పట్వారి శ్రీనివాస్, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భవనాన్ని మండల అధ్యక్షుడు చారగొండ్ల ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు చీదర జగదీశ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బచ్చు సోమేశ్వర్, గందె సోమయ్య, తమ్మి రాంబాబు, నాగమల్ల సోమేశ్వర్, పంతోష్, చారగొండ్ల సదానందం, సంతోష్, కృష్ణమూర్తి, రమాదేవి, దివ్యజ్యోతి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం



కేంద్రంలో ఉన్న తూకం వేసిన ధాన్యం

చిల్పూరు: రైస్ మిల్లుల యజమానుల నిర్లక్ష్యంతో కొనుగోలు కేంద్రాల్లో ధ్యాన్యం నిల్వలు పేరుకపోయాయని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ చాలా గ్రామాల్లో వడ్లు కాంటా కాలేదని, కొన్ని చోట్ల అయినప్పటికీ మిల్లులకు తరలించేందుకు మిల్లు యజమానులు లారీలు పంపించకపోవడంతో కేంద్రాల్లోనే ఉంటున్నాయని అన్నారు. కృష్ణాజీగూడెం పీఏసీఎస్ సెంటర్లో 20 రోజులుగా లారీలు ధాన్యం నిల్వలు పేరుకపోయాయని వర్షం పడుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కలెక్టర్ స్పందించి కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించే విధంగా చేయాలని కోరారు.